# నీలామాతగా దర్శనమిచ్చిన శ్రీ భద్రకాళీ అమ్మవారు

పద కొండవ రోజుకు చేరుకున్న శాకంబరీ నవరాత్ర మహోత్సవాలు

2 లో




తెలంగాణ దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఉమ్మడి వరంగల్

హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

బుధవారం । 17 । జూలై । 2024 । పేజీలు : 10




# నేడు తొలి ఏకాదశి



తొలి ఏకాదశి విశిష్టత

ఆనందంతో పాటు ఆరోగ్యం

2 లో



# ఇందిరమ్మ కమిటీలు!

సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్ , జూలై 16, ఆరు గ్యారంటీల అమలు కోసం ఇందిరమ్మ కమిటీల ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తునట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. 10 సంవత్సరాలు పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించాలనే ఉద్యేశంతో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అయితే ఇందిరమ్మ కమిటీలకు ప్రత్యేకమైన బాధ్యతలు అప్పగించడంతో పాటు తగిన గౌరవ వేతనం ఇస్తే ఎలా ఉంటుందనే దానిపై పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. ఇందిరమ్మ కమిటీలు గ్రామాల్లో , పట్టణాల్లోని వార్డులో వేయడం వల్ల మెజార్టీ నేతలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు వారికి తగిన గౌరవం ఇవ్వడమే కాకుండా గ్రామాల్లో బలమైన పట్టు ఉంటుందని భావి స్తున్నారు. అయితే బీఆర్ఎస్ రైతు సమన్వయ సమితి కమిటీలు వేసిన మాదిరి కాకుండా పకడ్బందీగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దీంతో ప్రతి గ్రామంలో ఒకటి, పట్టణాల్లో అయితే వార్డుకు ఒకటి చొప్పున

మిగతా 2లో..

ఆరు గ్యారంటీల అమలు కోసం గ్రామాలు, పట్టణాల్లో కమిటీ

ఒక్కో కమిటీలో ఐదుగురు సభ్యులు

## బల్దియాకు ఆదాయ మార్గాలపై
# దృష్టి సారించాలి

బల్దియా ఆస్తుల నివేదికలను అందజేయాలి

ట్రేడ్ లైసెన్స్ లేనివారికి తక్షణమే నోటీసులు ఇవ్వండి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



2 లో

# మతసామరస్యానికి ప్రతీక మొహరం పండుగ

7 లో






# ఇందిరమ్మ కమిటీలు!

మొదటి పేజీ తరువాయి..

ఐదుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. నియో జకవర్గ ఎమ్మెల్యే, ఇన్చార్జ్ మంత్రి ఆమోదంతో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఆరు గ్యారంటీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించే బాధ్యత కమిటీలకే అప్పగిస్తే ఎలా ఉంటుందనే దానిపై సమాలోన చేస్తున్నట్లు సమాచారం. దీంతో పథకానికైనా అర్హుల ఎంపిక ఇందిరమ్మ కమిటీల ద్వారా జరగనుంది. అధికరంలోకి వచ్చిన తరువాత వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అందులో భాగంగా పథకాల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమం పెట్టి దరఖాస్తులు తీసుకుంది. ఇప్పటికి కొన్ని గ్యారంటీలు అమలు చేసింది. మహిళల కు ఉచిత బస్సు ప్రయాణం , గృహ జ్యోతి కింద 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, రూ. 500 కే గ్యాస్ సిలండర్లు, ఆరోగ్య శ్రీ, తదితర సంక్షేమ పథకాలు ప్రారంభించింది. మరి కొన్ని పథకాలు ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉంది. ఈ నేపథ్యంలో పథకాలన్ని అర్హులందరికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. దీంతో ఆ బాధ్యతలను ఇందిరమ్మ కమిటీల కు అప్పగించాలని సర్కార్ భావిస్తున్నది. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా ఏ సమస్య ఉన్నా , దాని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తారని అనుకుంటున్నది. ప్రభుత్వ పథకాలు అందాల్సి ఉన్నా అందకుండా ఇబ్బంది పడుతున్న వారు మండల ఆఫీసులు, జిల్లా కలెక్టరేట్లు, సెక్రటేరియెట్ వరకు రావాల్సిన అవసరం ఉండదని యోచిస్తున్నది. ఏపీలో వలంటీర్ వ్యవస్థ మాదిరగా రాష్ట్రంలో ఇందిరమ్మ కమిటీలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు నేరుగా, వేగంగా అందించడానికి తోడ్పడేలా విధివిధానాలను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో బీఆర్ఎస్ రైతు సమన్వయ సమితి కమిటీలు వేసిన మాదిరి కాకుండా పకడ్బందీగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ఉండాలని నిర్ణయించింది. ఇందిరమ్మ కమిటీల కు ప్రత్యేకమైన బాధ్యతలు అప్పగించడంతో పాటు తగిన గౌరవ వేతనం ఇస్తే ఎలా ఉంటుందనే దానిపైనా చర్చలు జరుపుతున్నారు.

## ప్రేమోన్మాది దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన
### గిరిజన కుటుంబానికి కేటీఆర్ అండ



చెన్నారావుపేట జూలై 16 (సూర్య మేజర్ న్యూస్): వరంగల్ జిల్లా చెన్నారావు పేట మండలంలోని 16 చింతల తండ గ్రామంలో వారం రోజుల క్రితం ప్రేమోన్మాది చేతిలో దారుణ హత్యకు గురైన గిరిజన కుటుంబాన్ని ఆదుకునేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుకు వచ్చారు. ప్రేమోన్మాది మేకల నాగరాజు చేసిన దాడిలో తల్లితండ్రులిద్దరు బానోతు శ్రీనివాస్, సుగుణ దంపతులు చనిపోవటంతో ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు దీపిక, మదన్ లాల్ లు అనాథలయ్యారు. దాడి ఘటనలో ఇద్దరు పిల్లలు కూడా తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం కోలుకున్నారు. చనిపోయిన దంపతుల పిల్లలిద్దరిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆయన సతీమణి స్వప్న మంగళవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లారు. పిల్లలద్దరిని చూసిన కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆరోగ్యం గురించి వాకబు చేసి ధైర్యంగా ఉండాలని మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దీపిక, మదన్ లాల్ ల చదువు బాధ్యత తానే స్వయంగా తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. హత్యకు గురైన పిల్లల తల్లి సుగుణ బిఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త. గ్రామ పంచాయతీలో మాజీ వార్డు సభ్యురాలు కావడంతో బిఆర్ఎస్ పార్టీ తరపున వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ. 5 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. అత్యంత విషాదకరమైన ఈ సంఘటనలో తల్లిదండ్రులను కోల్పోవటమే కాదు...దాడికి గురైన పిల్లలు దీర్ఘాకాలం చికిత్స తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ నేపథ్యంలో కుటుంబానికి భరోసా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షలు వారికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ ఘటనలో నిందితుడు నాగరాజుకు కఠిన శిక్ష పడేలా తగిన చర్యలు తీసుకునేలా డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన కోరారు.

# నేడు తొలి ఏకాదశి



మహబూబాబాద్ ప్రతినిధి, జులై16,మేజర్ న్యూస్(సూర్య): హిందువుల తొలి పండుగ తొలి ఏకాదశి. ఈ పర్వదినంతోనే మన పండగలు మొదలవుతాయి. వరసగా వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండగలు వస్తాయి. హైందవ సంస్కృతిలో తొలి ఏకాదశికి విశేష స్థానముంది. దీన్ని 'శయనైకాదశి' అని, 'హరి వాసరం', 'పేలాల పండగ' అని కూడా పిలుస్తారు. తొలి ఏకాదశి సందర్భంగా.. ఈ పండగ విశిష్టత, పూజా విధానం గురించి తెలుసుకుందాం..ఒక ఏడాదిలో 24 ఏకాదశుల్లో వస్తాయి. వీటిలో ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశిగా'గా పిలుస్తారు. పురాణాల ప్రకారం.. శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై నాలుగు నెలల పాటు శయనిస్తాడు. అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో వచ్చే ప్రబోధినీ ఏకాదశి ఆయన తిరిగి మేల్కొంటాడు.ఈ నాలుగు నెలల్ని చాతుర్మాసాలుగా వ్యవహరిస్తారు. తొలి ఏకాదశి నుంచి 4 నెలల పాటు చాతుర్మాసదీక్షను ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు స్వామివారు పాతాళ లోకంలో బలి చక్రవర్తి వద్ద ఉండి కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని పురాణగాథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది.

### పూజకు పూజ.. ఆరోగ్యానికి ఆరోగ్యం .

ఉత్తరాయణంలో కంటే దక్షిణాయనంలో పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా సంభవించే కాలం కూడా ఇదే. కాబట్టి ఈ కాలంలో ఆరోగ్య పరిరక్షణా నియమాలు ఆచరించాలి. అందువల్ల ఈ కాలంలో పెద్దలు వ్రతాలు, పూజలు ఆచరించాలని నిర్దేశించారు. అంటే తొలి ఏకాదశి ఉపవాస దీక్ష ఆరోగ్య పరంగానూ మనకు మేలు చేస్తుందన్నమాట. కృతయుగంలో మురాసురుడనే రాక్షసుడు.. బ్రహ్మ వరంతో దేవతలను, రుషులను హింసించాడని మరో కథ ప్రాచుర్యంలో ఉంది. ఆ రాక్షసుడితో శ్రీమహావిష్ణువు వెయ్యేళ్లు పోరాడి, అలసిపోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా.. శ్రీహరి శరీరం నుంచి ఓ కన్య ఆవిర్భవించి, ఆ రాక్షసుణ్ని అంతం చేసిందట. ఇందుకు సంతోషించిన శ్రీమహావిష్ణువు ఆ కన్యను వరం కోరుకోమనగా.. తాను విష్ణుప్రియగా లోకం చేత పూజలు అందుకోవాలని కోరుకుందట.నాటి నుంచి ఆమె 'ఏకాదశి' తిథిగా వ్యవహారంలోకి వచ్చింది. అప్పటి నుంచి సాధువులు, భక్తులు 'ఏకాదశి' వ్రతం ఆచరించి విష్ణుసాయుజ్యం పొందినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. అంబరీషుడు, మాంధాత, తదితర పురాణ పురుషులు ఏకాదశి వ్రతాన్ని ఆచరించినట్లు రుషులు చెబుతారు.

### ఏకాదశి పర్వదినాన ఏం చేయాలి?

ఏకాదశి రోజున ఉపవాసం ఉండాలి. ఆ రోజు రాత్రంతా జాగరణ చేయాలి. ఈ సమయంలో విష్ణుసహస్రనామ పారాయణ, విష్ణుమూర్తికి సంబంధించిన భాగవతాన్ని చదువుకోవడం లాంటివి చేయాలి. మరుసటి రోజైన ద్వాదశి నాడు సమీపంలోని దేవాలయానికి వెళ్లి ఉపవాస దీక్షను విరమించాలి. తొలి ఏకాదశి రోజున ఆవులను పూజిస్తే విశేష ఫలితాలు కలుగుతాయని చెబుతారు.తొలి ఏకాదశి నాడు పేలాల పిండిని తప్పక తినాలని పెద్దలు చెబుతారు. పేలాలు పితృదేవతలకు ఎంతో ఇష్టమైనవి. అంతేకాకుండా మనకు జన్మనిచ్చిన పూర్వీకులను పండగ రోజున గుర్తు చేసుకోవడం మన బాధ్యత.వాతావరణ పరిస్థితుల్లో మార్పు వచ్చే కాలం కాబట్టి మన శరీరం ఆరోగ్యపరంగా అనేక మార్పులకు లోనవుతుంది. గ్రీష్మ రుతువు ముగిసిన తర్వాత వర్ష రుతువు ప్రారంభమయ్యే కాలంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఈ సమయంలో శరీరానికి పేలాల పిండి వేడిని కలగజేస్తుంది. అందువల్ల ఈ రోజున ఆలయాల్లో, ఇళ్లలో పేలాల పిండిని ప్రసాదంగా పంచడం ఆనవాయితీగా వస్తోంది.

# బల్దియాకు ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి



భూపాలపల్లి రూరల్ జూలై 16 మేజర్ న్యూస్ సూర్య : భూపాలపల్లి బల్దియా( మున్సిపాలిటీకి )ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ మార్గాలపై దృష్టి సారించారని, మున్సిపల్ ఆస్తులను గుర్తించి రెండు, మూడు రోజుల్లో నివేదికలను సమర్పించాలని కమిషనర్ను కోరారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కు ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయని అడగగా కమిషనర్, మున్సిపల్ అధికారులు సమాధానం ఇవ్వకపోవడంతో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. వర్షాల నేపథ్యంలో ఈదురు గాలుల మూలంగా చెట్లు విరిగిపడటం, స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడడం వంటి ఘటనలు జరుగుతుంటాయని.., కావున, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎవరికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా వెంటనే స్పందించాలని కోరారు. భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి వెంట డివైడర్ మధ్యలో ఉన్నటువంటి కోనోకార్పస్ చెట్ల వలన ప్రజలకు శ్వాసకోస వ్యాధులు కలుగుతున్నాయని, వాటిని పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే చెట్లను నాటాలని సూచించారు.



భూపాలపల్లిలో దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ లను తీసుకోకపోవడం మూలాన, మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందని పలువురు కౌన్సిలర్లు కోరగా, వాటిపై కమిషనర్ దృష్టి సారించి, ఆదాయం పెంపు దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, రోడ్ల వెంట మురికి కాల్వలలో చెత్తా, చెదారం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీలలో దోమల నివారణకు రెగ్యూలర్ గా ఫాగింగ్ చేయాలన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, సింగరేణి క్వార్టర్స్, పలు పార్టీల రాజకీయ కార్యాలయాల నుండి పెండింగ్ లో ఉన్న ఆస్తి పన్నులు మొత్తం వసూలు చేయాలని కమిషనర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, భూపాలపల్లి ఎమ్మార్వో శ్రీనివాస్, మున్సిపల్ డీఈ శ్రీనాథ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, పలు వార్డుల కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

# నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్, జూలై 16, మేజర్ న్యూస్(సూర్య): మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని ఫాతిమ హైస్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి గ్రంథాలయాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ప్రారంభించారు.ఎమ్మెల్యే కి విద్యార్థులు స్కూల్ యాజమాన్యం ఘన స్వాగతం పలికారు.విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని వారి యొక్క విజ్ఞాన నైపుణ్యాన్ని సరికొత్త విషయాలను మేధాశక్తిని పెంపొందించుకోవడానికి ఇది ఒక చక్కటి అవకాశం అనీ విద్యార్థులకు సూచించారు విద్యార్థులు క్రమశిక్షణతో ఒక చక్కటి విద్యని అభ్యసించి మీ యొక్క తల్లిదండ్రులకు స్కూల్లో ఉన్నటువంటి గురువులకు ఒక మంచి పేరును ప్రత్యేకతలను తీసుకురావాలని మీరు కూడా ఉన్నంత శిఖరాలను అవరోధించాలన్నారు. స్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ విభాగాల లీడర్ షిప్ ను ఏర్పాటు చేశారు వారికి అభ్యర్థులను మూమెంట్లను అలాగే ఆయా విభాగాల డ్రెస్ కోడ్ ను విద్యార్థులకు బహుకరించారు. అనంతరం ఫాతిమా హైస్కూల్ ప్రాంగణంలో వారు ఏర్పాటు చేసినటువంటి వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అక్కడున్నటువంటి స్కూల్ యాజమాన్యం తో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ,గణపురపు




అంజయ్య ,శనిగపురం వార్డు కౌన్సిలర్ హరి,శాంతన్ రామరాజు, యూత్ నాయకులు శ్రావణ్,చరణ్ తదితరులు పాల్గొన్నారు





## పేదింటి మహిళకు ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం



కన్నాయిగూడెం, జులై 16(మేజర్ న్యూస్ సూర్య ): కన్నాయిగూడెం మండలం గూర్రేవుల గ్రామానికి చెందిన షేక్ హసీనా తీ/గా వలి గత కొన్ని రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ మూడు రోజుల క్రితం వరంగల్ విశ్వాస్ హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యారు టెస్టులు చేసి గర్భసంచి ఆపరేషన్ చెయ్యాలి అంటున్నారు.50వేల రూపాయలు ఖర్చు అవుతాయి.హసీనా వాళ్ళు పేద కుటుంబం కావడంతో భర్త వలి నా భార్య ఆపరేషన్ కు సహాయం చెయ్యాలని ముప్పనపల్లి సహాయ నిధి టీం వాళ్ళను కోరగా సహాయ నిధి గ్రూపు దాతల సహాయంతో మంగళవారం రోజున వాళ్ళ ఇంటికి వెళ్లి హసీనా ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని 13వేల500 రూపాయలు వాళ్ళ అబ్బాయికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహాయ నిధి సభ్యులు విజయ్ కిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల తిరుపతికి శ్రీ శ్రీనివాస భజన మండలి



గణపురం జులై 16 మేజర్ న్యూస్ సూర్య: తిరుమల తిరుపతి లో జరిగే అఖండ హరినామ సంకీర్తనకు చెల్పూర్ శ్రీ శ్రీనివాస భజన మండలి సభ్యుల బృందం మంగళవారం బయలుదేరి వెళ్లారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారీ నిర్వహించే కార్యక్రమానికి భజన మండలి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది అందులో భాగంగా శ్రీ శ్రీనివాస భజన మండలి బృందం సభ్యులు సీత సదానందం వీరవేణి శ్రీనివాస్ యాదవ్ అన్నం కుమార్ బొందిలి రమేష్ సింగ్ దుంప నరసయ్య అడప సతీష్ ముల్కనూరు విద్యాసాగర్ మాధవరావు ముల్కనూరు యాదగిరి సుర సంతోష్ దిద్ది రాజయ్య తోకల రజనీకాంత్ దేవునూరి రాజన్న వావిలాల సంపత్ కుమార్ ఎంపెల్లి శంకర్ ర్ లు తిరుమల తిరుపతి వెళ్లిన వారిలో ఉన్నారు.

## ముదిరాజులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలి



పర్వతగిరి (జూలై 16) సూర్య న్యూస్: ముదిరాజులకు ప్రభుత్వం ఇచ్చిన అభయ హస్తం హామీలను నెరవేర్చాలని పర్వతగిరి మండల ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ మంగళవారం రోజున నిర్వహించారు. తమ హామీలను మండల రెవెన్యూ అధికారి ద్వారా నెరవేర్చాలని ర్యాలీగా రెవెన్యూ ఆఫీసు వద్దకి వెళ్లారు. బిసి డి నుండి ఏ కు మార్చడం. స్పెషల్ జీవోను అమలు చేయడం అదేవిధంగా గుంటలు, చెరువులు సంపూర్ణ హక్కులను కల్పించే విధంగా చట్టం తేవాలన్నారు. తమ న్యాయమైన కోరికలను ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజ్ కులస్తులు స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు నీరటీ వెంకన్న, పిట్టల రాజు, గుండా రాకేష్ ,సూర అశోక్ , సూర రమేష్ , కొత్తూరు రామ్మోహన్ ,చిరుత విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్



వెంకటాపురం నూగూరు జులై 16 సూర్యా మేజర్ న్యూస్ ములుగు జిల్లా వెంకటాపురం మండలం లో వీరభద్రవరం నుండి పాలెం పాత్ర పురం వెంగళరావుపేట ఉప్పేడు గొల్లగూడెం వరకు ఇసుక లారీలతో మంగళవారం ట్రాఫిక్ స్తంభించింది. ఖాళీలారీలు ఓ వైపు, మరో వైపు లోడు లారీలతో మధ్యాహ్నం ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వెంకటాపురం మీదుగా ఆలు బాక ఎదిర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ద్విచక్రవాహనదారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆలు బాగా వద్ద 2 ఇసుక క్వారీలో రోడ్డుపై లారీలు నిలిపివేయడంతో మరింత ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం ఇదే తీరు కొనసాగుతున్నా సంబంధిత టీజీఎండీసీ, పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. అటువైపు చూసిన దాఖలాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడే ఒక్కపూట హడావిడి చేసి వదిలేస్తున్నారని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. క్వారీల యజమానులు లారీలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయలేదు. దీంతో వెంకటాపురం నుంచి వీరభద్రవరం వరకు 10 కిలోమీటర్ల మేర లారీలు రెండువైపులా రోడ్డుపై తిష్టవేసి ఉంటున్నాయి. దీంతో రవాణా సౌకర్యాలు లేక సామాన్యులు గంటలపాటు రోడ్డుపై సర్కస్ ఫీట్లు చేస్తూ ఇళ్లకు చేరుతున్నారు. ప్రమాదాలు జరుగకముందే నివారణ చర్యలు చేపట్టాలని, లారీలతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు



## సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలి

### చిట్యాల సిఐడి మల్లేష్

గణపురం జులై 16 మేజర్ న్యూస్ సూర్య: మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చిట్యాల సిఐ డి మల్లేష్ అన్నారు. మంగళవారం గణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక వ్యాపార వర్గాల తో పాటు వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. ముఖ్యంగా నేరాలు జరిగిన సమయంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని మండల కేంద్రంలో సుమారు 60 కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కెమెరాల ఏర్పాటుకు ముగ్గురితో కమిటీ ఏర్పాటు చేసుకొని వ్యాపార వాణిజ్య వర్గాలందరూ సమిష్టిగా ముందుకు వచ్చి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని తమ సిబ్బంది కూడా వ్యాపార వర్గాలకు సహకరిస్తారని సిఐ అన్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ను పరిశీలించి అవసరమున్న చోట మళ్లీ కెమరాలను ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో సీసీ కెమెరాల వల్ల ఎన్నో కేసులు పరిష్కారమయ్యాయని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ అభివృద్ధికి సహకరించాలని సిఐ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గణపురం ఎస్ఐ మచ్చ సాంబమూర్తి లతో పాటు వ్యాపారులు పాల్గొన్నారు.





## కీర్తినగర్‌లో పారిశుధ్య పనులు చేపట్టిన కార్పొరేటర్

గీసుగొండ జులై 16 మేజర్ న్యూస్ (సూర్య) : వరంగల్ మహానగర పాలకసంస్థ 16వ డివిజన్ పరిధి కీర్తినగర్ లోని పలు వీధులలో నెలకొన్న స్థానిక సమస్యలు, పారిశుధ్య పనులు, వాటర్ సప్లయి నిర్వహణ పై స్థానిక కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ కాలనీ లో పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల మోరీలు నిండటం,సీసీ రోడ్ల కు ,ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దోమలు పెరిగే అవకాశం ఉన్నందున మున్సిపల్ జేసిబి తెప్పించి శుభ్రం చేపించినట్లు తెలిపారు.అనంతరం వర్షా కాలం సమీపించినందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున కాలనీ వాసులు వారి ఇంటి ఆవరణలో నీటిని నిల్వ ఉంచకుండా చూడాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీ.ఆర్.యస్ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి మెండు కమలాకర్,ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు,రమేష్,చల్ల కుమార్,సతీష్,శ్రీనివాస్,మున్సిపల్ జవాన్ రాజేష్ ,మున్సిపల్ వాటర్ మెన్ బొంద్యలు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### మండల వైద్యాధికారి డాక్టర్ అర్చన



గీసుగొండ జులై 16 మేజర్ న్యూస్ (సూర్య) జిల్లా వైద్యాధికారి ఆదేశానుసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గీసుగొండ పరిధిలోని ఉప కేంద్రాల గ్రామాలలో సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు , మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ అర్చన తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మాట్లాడుతూ వైద్య శిబిరంలో భాగంగా సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు , పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. వైద్య శిబిరం లో జ్వరంతో పాటు ఇతర ఇబ్బందులు ఉన్న గ్రామాల ప్రజలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందచేసినట్లు ఆమె పేర్కొన్నారు. వైద్య శిబిరం లో ఉప కేంద్రాల డాక్టర్లు, సిహెచ్ఓ మధుసూదన్ రెడ్డి, సూపర్వైజర్లు కిరణ్ కుమార్, స్వరూప, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



## ఎమ్మెల్యే డా మురళి నాయక్



మహబూబాబాద్ రూరల్, జూలై 16, మేజర్ న్యూస్(సూర్య): ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి 80 కోట్ల రూపాయలు తీసుకువచ్చానని ఎమ్మెల్యే డాక్టర్.మురళీ నాయక్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 99 మంది లబ్ధిదారులకు 99 లక్షల 11 వేల 484 రూపాయల కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సేద్యం చేయని కొండలు , గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు రైతు బంధు తీసుకున్నారని , కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు భరోసా పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ రైతుల నుంచి సలహాలు సూచనలు తీసుకొని రైతులకు లబ్ధి చేకూరే విధంగా రైతు భరోసా,ఇన్ పుట్ సబ్సిడీ , కౌలు రైతులకు రైతు బంధు తదితర విషయాల పై ఒక క్యాలెండర్ ను ఏర్పాటు చేసి,దాని ప్రకారం అందజేస్తామన్నారు. వికలాంగులకు దసరా నుంచి పెంచిన పెన్షన్ ను అందజేస్తామని. నియోజకవర్గానికి 3500 ఇందిర ఇండ్ల ను పూరి గుడిసెల్లో నివసించే నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామని , వీటి తర్వాత మహిళలకు 2,500,కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం తదితర సంక్షేమ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. మహబూబాబాద్ ఆర్టీసీ బస్ డిపోలో రద్దీ కి అనుగుణంగా కావలసిన బస్సులను ఏర్పాటు చేస్తున్నామని , గృహజ్యోతి పథకంలో జీరో కరెంట్ బిల్లు రానివారు మండల పరిషత్ కార్యాలయం లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, వారందరికీ జీరో బిల్లు వస్తుందని తెలిపారు. ఇది ప్రజా ప్రభుత్వమని ,24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు పలు వార్డుల కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీపీఎం పార్టీ నాయకులు యూత్ నాయకులు వివిధ విభాగాల నాయకులు కాంగ్రెస్ పార్టీ అనుసంధా పార్టీల నాయకులు కార్యకర్తలు మహిళా మణులు లబ్ధిదారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### రిలయన్స్ జియో ఉద్యోగుల ఔదార్యం



కమలాపూర్ జులై 16 మేజర్ న్యూస్ : కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన మొండెద్దుల శ్రీకాంత్ బ్లడ్ క్యాన్సర్ తో ఇటీవల మృతి చెందాడు. శ్రీకాంత్ జియో కంపెనీలో కాంట్రాక్టు టెక్నీషియన్ గా పని చేస్తున్నాడు. చేతికందిన కొడుకు దురదృష్టవశాత్తూ మరణించడంతో ఆ కుటుంబానికి ఆధారం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న రిలయన్స్ జియో సీనియర్ మేనేజర్ పోతిరెడ్డి నవీన్ తోటి ఉద్యోగులు కలిసి బాధిత కుటుంబానికి 1,05,500 ( లక్ష ఐదు వేల ఐదు వందలు) రూపాయలు అందజేశారు. కష్ట కాలంలో ఉన్న తమకు ఉదార స్వభావం కలిగిన పోతిరెడ్డి నవీన్ తోటి ఉద్యోగులు అండగా నిలిచారని వారికి శ్రీకాంత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా తోటి ఉద్యోగులు చేసిన ఈ ఆర్థికసాయం పట్ల స్థానికులు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేసారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన నవీన్ నీ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జియో కంపెనీ ఉద్యోగులు కృష్ణం రాజు, శ్రావణ్, సూపర్వైజర్ మణికంఠ, హరీష్ స్థానికులు పాల్గొన్నారు.

## బస్టాండులో సిసి రోడ్డుని నిర్మించాలి

**-విద్యుత్ దీపాలు, తాగునీరు, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పించాలి**

**-ఎస్ ఎఫ్ ఐ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి గంధసిరి జ్యోతి బసు**




కురవి జూలై 16, మేజర్ న్యూస్ (సూర్య): కురవి మండల కేంద్రము లోని బస్టాండులో సిసిరోడ్, విద్యుత్ దీపాలు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ఎస్ ఎఫ్ ఐ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కురవి బస్టాండ్ ని సందర్శించిన అనంతరం ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి గంధసిరి జ్యోతి బసు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రయాణికులకు అందుబాటులో లేని బస్టాండు ప్రయాణికుల వినతి మేరకు సంబంధిత అధికారులు స్పందించి, బస్టాండ్ ను పది రోజుల క్రితమే అందుబాటులోకి తీసుకుని రావడం జరిగిందని ఆయన అన్నారు చినుకు పడితే చిత్తడవుతున్న బస్టాండ్ ఆవరణం బురదమయంగా మారింది.కొన్ని బస్సులు బురుదలో కూరుకుపోయి తీవ్ర ఇబ్బందులకు గురికాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. కావున విద్యార్థులు, స్కూళ్లకు, కాలేజీలకి పోయే సందర్భంలో విద్యార్థులతో పాటు సామాన్య ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ కు తాత్కాలిక మరమ్మత్తులు కాకుండా శాశ్వతమైన పరిష్కారం చూపాలని కోరారు .కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొలిపాక వీరేందర్,నాయకులు శరత్,కార్తీక్, వినయ్, ప్రవీణ్, రవీందర్, అనిల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు, సిబ్బంది బదిలీలపై కౌన్సెలింగ్ నిర్వహించిన అదనప కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్ జులై 16 మేజర్ న్యూస్ సూర్య :ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా పరిధిలోకి వచ్చే పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా పరిధిలోకి వచ్చే జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, కార్యాలయ సబార్డినేట్ల బదిలీల ప్రక్రియకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లా పరిధిలోకి వచ్చే పోస్టులకు బదిలీల చేయాల్సి ఉన్నందున ఆయా శాఖల అధికారులు అందచేసిన జాభితా మేరకు ఒకే చోట నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్న వివిధ శాఖల్లో పని చేసే జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, కార్యాలయ సబార్డినేట్లు ఇచ్చిన ఆప్షన్ మేరకు కోరుకున్న స్థానాలకు పారదర్శకంగా బదిలీలు చేయడం జరుగుతుందన్నారు. నిర్వహించిన కౌన్సలింగ్ కు అందుబాటులో లేని సిబ్బంది ఈ నెల 18 వ తేదీన మరోసారి కౌన్సిలింగ్ కు హాజరు కావాలని ఆయన సూచించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు వారి కార్యాలయ సిబ్బంది 28వ తేదీ గురువారం నిర్వహించనున్న కౌన్సెలింగ్ కు తప్పని సరిగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి కౌన్సెలింగ్ సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# అయినవోలు మల్లన్న ఉండి లెక్కింపు



అయినవోలు మేజర్ న్యూస్ సూర్య జూలై (16) హనుమకొండ జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి భక్తులకు ఐలోని మల్లన్న దర్శనమిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం నందు ఉండి లెక్కించడం జరిగింది 109 రోజులకు గాను వచ్చిన ఆదాయం వివిధ టికెట్ల రూపంలో తో కలిపి 24 లక్షల 93 వేల 422 రూపాయలు రావడం జరిగింది ,హుండీలో మిశ్రమ వెండి బంగారం తిరిగి మళ్లీ హుండీలోనే వేయనైంది. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్మాణాధికారి అద్దంకి నాగేశ్వరరావు దేవాదాయ శాఖ వరంగల్ డివిజనల్ పరిశీలకులు జి సంజీవరెడ్డి అయినవోలు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఓం ప్రకాష్ మహబూబాబాద్ జిల్లా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు తోపాటు ఆలయ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,





## నీలా మాతగా దర్శనమిచ్చిన శ్రీ భద్రకాళీ అమ్మ వారు

హనుమకొండ, జూలై 16, మేజర్ న్యూస్: శ్రీ భద్రకాళి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్ర మహోత్సవాలలో భాగంగా అమ్మ వారు మంగళవారం నీలా మాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శాకంబరీ ఉత్సవాలు మంగళవారం నాటికి పద కొండవ రోజుకు చేరుకున్నాయి. జ్యోతిశాస్త్రం ప్రకారం దశమీ తిథికి అధి దేవత యుముడు. ఈ తిథికి దశమహా విద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి నీలా అమ్మ వారు అధిదేవత అని యముని యొక్క సంహార శక్తి అమ్మ వారు ఆరాధించిన వారిని మృత్యువు బాధించదని, భక్తులు దీర్ఘమైన ఆయుష్యును కలిగి ఉంటారని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఈతి బాధలు అమ్మ వారి భక్తు లకు దరి చేరవన్నారు. ఇహపర సౌఖ్యాల ను ఈ నీలా అమ్మ వారు ప్రసాదిస్తుందన్నారు. షోడ శ్రీ క్రమాన్ని అనుసరించి అధి దేవత నిత్యా భక్తుల కు శాశ్వతమైన అనందాన్ని అమ్మ వారు ప్రసాదిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శేషు భారతి తదితరులు పాల్గొన్నారు.



# కులమతాలకతీతం మొహర్రం

### ఆనందోత్సవాల మధ్య వేడుకలు జరుపుకోవాలి

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### పీరీల వద్ద ప్రత్యేక పూజలు

గణపురం జులై 16 మేజర్ న్యూస్ సూర్య:కుల మతాలకతీతంగా మొ హర్రం వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ గా వస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన వీరిల వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జట్టి కట్టి పీరీలను మోస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం వేడుక లను ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వైస్ చైర్మన్ దూడపాక శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు విడిది నేని అశోక్, చోటేమియా,వడ్లకొండ నారాయణ గౌడ్ ,మోటపోతుల శివ శంకర్ గౌడ్, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, కటుకూరి శ్రీనివాస్,దుగ్యాల నారాయణ రావు,ఓరుగంటి కృష్ణ,దూడపాక పున్నం,జానీ, సోషల్ మీడియా కన్వీనర్ ర్ జోడు ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణ

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ**

**దోమల నివారణకు రెగ్యులర్‌గా ఫాగింగ్ చేపట్టాలి**

**పెండింగ్ పన్నులు వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**




ములుగు, సూర్యప్రతినిధి జులై 16 (మేజర్ న్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధుల వ్యాప్తినీ అడ్డుకట్ట వేయవచ్చని, పారిశుధ్య నిర్వహణను అత్యధిక ప్రాధాన్యతతో చేపట్టాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పారిశుధ్యంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి రోజూ రోడ్లను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని, డ్రైనేజీలను క్లీన్ చేయాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, రోడ్లపై ప్లాస్టిక్ కనిపించకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి రోజూ ఉదయం వార్డ్ అధికారులు, సానిటేషన్ సూపర్ వైజర్ లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ చేసేలా పర్యవేక్షించాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో



అలసత్వం ఉంటే ఎక్కువ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటాయని అన్నారు. జిల్లాలో పారిశుధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగటం లేదని, అనేక ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిల్వ ఉండటం గమనించామని అన్నారు. గ్రామాలలో ఫాగింగ్ రెగ్యులర్ గా చేయాలని, వర్షం పడిన తర్వాత నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమలు పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయాలని ఆమె సూచించారు. నీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు పెరిగి వ్యాధిగ్రస్తులు అవుతారనే అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లతో సమన్వయం చేసుకొని ప్రజలకు పారిశుధ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో నీరు నిల్వ అధికంగా ఉండే వల్నరబుల్ ప్రాంతాలను గుర్తించి అక్కడ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాల పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, సంక్షేమ హాస్టల్ లను నేరుగా తనిఖీ చేసి పరిసరాలు పరిశుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, వంట చేసే ప్రాంతాలలో పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని, ఫుడ్ పాయిజనింగ్, సీజనల్ వ్యాధులు వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ఉదయం 7 గంటలకు పర్యటిస్తూ డ్రై డే నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ప్లాస్టిక్, చెత్త అధికంగా ఉండటానికి వీలు లేదని, జిల్లాలో ఉన్న డ్రైయిన్ లను రెగ్యులర్ గా శుభ్రం చేయాలని అన్నారు. సెగ్రిగేషన్ షెడ్ పూర్తి స్థాయిలో వినియోగం లోకి తీసుకుని రావాలని అదనపు కలెక్టర్ పంచాయతీ కార్యదర్శులను సూచించారు..జిల్లాలో ఉన్న ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవో లు ఎంపీ ఓలు,పంచాయతీ సెక్రెటరీలు, టెక్నికల్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ స్కూల్ విద్య పిల్లల బంగారు భవితకు పునాది



కేసముద్రం, జూలై 16, మేజర్ న్యూస్ (సూర్య): ప్రీ స్కూల్ విద్య పిల్లల బంగారు భవితకు పునాది అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సర్దార్ బీ అన్నారు. అమ్మ మాట...అంగన్ వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబాబాద్ ప్రాజెక్ట్, పెనుగొండ సెక్టార్, కేసముద్రం స్టేషన్ గ్రామపంచాయతీ పరిధిలోని 8 అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, తల్లులు, పిల్లలు,లావోక్తులచే మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సూపర్వైజర్ సర్దార్ బీ మాట్లాడుతూ..అంగన్ వాడి కేంద్రాలలో పిల్లల నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్ వాడీ కేంద్రాలకే పంపించాలని, పిల్లల సమగ్రాభివృద్ధికి అంగన్ వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడతా యని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎఎస్ కోఆర్డినేటర్ షేక్ ఖాదర్, ఉపేందర్, ఏఎన్ఎం సుప్రియ, ఆశా నాగమణి, అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## రుణమాఫీకి రేషన్ కార్డ్ నిబంధన ఎత్తివేయాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి**



కురవి జూలై 16, మేజర్ న్యూస్ (సూర్య): రైతుల రెండు లక్షల రుణ మాఫీకి రేషన్ కార్డ్ నిబంధన ఎత్తివే యాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కురవి మండల కేంద్రం సిపిఐ కార్యాలయం లో సుధాకర్ రెడ్డి రైతు రుణమాఫీ కి ప్రభుత్వం పెట్టిన రేషన్ కార్డు నిబంధన ను ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా రేషన్ కార్డులు జారీ చేయకపోవడం మూలంగా అర్హులైన అనేకమంది రైతు కుటుంబాలు రకరకాల కారణాలతో వేరుపడి కుటుంబాలుగా చలామణి అవుతున్నారని వారందరికీ రేషన్ కార్డు ఉండాలి అనే నిబంధన తెలంగాణ ప్రభుత్వం పెట్టడం మూలంగా తీవ్ర నష్టం జరుగుతుందని దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

# చిన్న చిన్న వర్షాలకే చెరువులు మైమరిపిస్తున్న రోడ్లు



**ప్రయాణం చేయాలంటే నరకం అనుభవిస్తున్న స్థానికులు**

**గత కొన్నేళ్లగా ఈ రోడ్డు గుంతలతో దర్శనమిస్తోంది**

**మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు**

**ప్రమాదాల బారిన పడుతున్నారు**

**గతంలో ఈ రోడ్డు పరిస్థితులపై**

**అధికారులకు దృష్ట సారించిన దాఖలాలు లేవు**

**కొత్త రోడ్లు ఎలాగో వెయ్యరు కనీసం మరమ్మతులైనా**

**చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు**




బయ్యారం జూలై 16 మేజర్ న్యూస్ (సూర్య): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల వ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న చిన్న చిన్న వర్షాలకు రోడ్లన్నీ చెరువులను మైమరిపిస్తున్నాయి. మండల పరిధిలో స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంక్ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. అదే నేతాజీ నగర్ రోడ్ లో మీసేవ కేంద్రం మరియు మసీద్ ఉండడంతో మీ సేవ కేంద్రానికి వెళ్లే ప్రజలకు, మసీదుకు వెళ్లే భక్తులకు ప్రజలకు చిన్న చిన్న వర్షాలకే రోడ్లు అస్తవ్యస్తంగా మారి ఇబ్బంది కరంగా ఏర్పడుతున్నాయి. గత కొన్నేళ్ల నుంచి అదే పరిస్థితుల్లో ఈ రోడ్డు గుంతలతో దర్శనమిస్తోంది. చిన్నపాటి వర్షాని కి నీరంతా చేరి, ఈ రోడ్లలో ప్రయాణం చేయాలంటే నరకం అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోకాళ్లలోతు నీరు నిలువ ఉంటుందని వాపోతున్నారు. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు, మసీద్,మీసేవ కేంద్రానికి, మినీ బ్యాంక్, మెడికల్ షాప్ లు అన్ని ఒకే దగ్గర ఉండటం అలాగే మహబూబాబాద్ టు భద్రాచలం ప్రధాన రహదారికి సమీపంలోనే ఉండడంతో ఈ ప్రదేశం ఎప్పుడు ప్రజలతో రద్దీగా ఉంటుంది. గతంలో ఈ రోడ్డు పరిస్థితులపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం దృష్టి సారించిన దాఖలాలు లేవని,కొత్త రోడ్లు ఎలాగో వెయ్యరు కనీసం పాడైన రోడ్లకైనా మరమ్మతులైనా చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మరి అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

# సీజనల్ వ్యాధులపై ఎంపిడిఓ గుండె బాబు సమీక్ష

## సమీక్షలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ, గ్రామపంచాయతీ సిబ్బంది

కమలాపూర్ జూలై 16 మేజర్ న్యూస్ : హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు కమలాపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై



ఎంపీడీవో గుండె బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని దానివల్ల కొంతవరకు దోమలను అరికట్టవచ్చని, దోమలు ఎక్కువగా నీరు నిల్వ ఉన్న నీటి గుంటలోనే నివసిస్తాయని, ఈ ఆయిల్ బాల్స్ వల్ల దోమలు నీటి గుంటల్లో నివాసం ఏర్పరచుకోవని, వాటి నివాసానికి ఇవి ఆటంకం కలుగజేస్తాయని తెలిపారు. సిస్టర్లు, ఆశా కార్యకర్తలు గ్రామపంచాయతీ శానిటేషన్ రిజిస్టర్ లో విధిగా సంతకాలు చేయాలని, గ్రామస్థాయిలో పనిచేసే శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారులు డాక్టర్ శివకుమార్, రాజా హైదర్, అరుణ్ కుమార్, మాధవి, మౌనిక, రేణుక, రోహిత్ కుమార్, ఎంపీహెచ్వో రవీందర్, పిహెచ్ఎన్ లీలావతి, హెల్త్ సూపర్వైజర్లు విప్లవ కుమార్, అమృత, కనకలక్ష్మి, మారియా థామస్, హెల్త్ అసిస్టెంట్లు బాబు, గోవర్ధన్, రాము, ప్రభాకర్, కమలాపూర్ మండల పంచాయతీ సెక్రటరీలు, కమలాపూర్, ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిస్టర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో, ఉపకేంద్రం స్థాయిలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ను ఏర్పాటు చేశామని, ఈ టీమ్స్ ఆరోగ్యం గురించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తుందని, అంతేకాకుండా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో, పరిసరాలను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలో ప్రజలకు తెలియజేస్తాయని అన్నారు. ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు ప్రతిరోజు ఫీవర్ సర్వే చేయాలని వారికి సూచించారు.

**డాక్టర్ నాగరాజ్**
**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్**



వ్యాధులు వ్యాపించిన తర్వాత బాధపడడం కన్నా అవి వ్యాపించక ముందే జాగ్రత్త పడడం మంచిదని, ఈ సీజన్లో ఎక్కువగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, గాలి, నీరు, దోమల ద్వారా వ్యాధులు వ్యాపించకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ఇంటి పరిసరాలను, డ్రైనేజీలను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలో మండల స్థాయిలో ఉన్న ప్రభుత్వ శాఖలకు అన్నిటికీ, ప్రత్యేకంగా ఆరోగ్య శాఖకు సంబంధించిన డాక్టర్లకు, సిస్టర్లు, ఆశా కార్యకర్తలకు, ముఖ్యంగా శానిటైజేషన్ సిబ్బందికి వారితో పాటుగా గ్రామపంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్**

# ఆర్టీసీ అధికారుల అండదండలతో బోర్డును తొలగించిన కబ్జా కోర్లు

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య

జఫర్ గడ్, జూలై 16 మేజర్ న్యూస్ (సూర్య): మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలాన్ని సూచిక బోర్డులను ఆర్టీసీ అధికారుల అండదండలతో బోర్డులను ధ్వంసం చేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలంలో ఏర్పాటుచేసిన సూచిక బోర్డులను కబ్జా కోర్లు దాంసం చేశారు. పట్టి స్థలాన్ని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాన్ని కబ్జాకోర్లు స్వాధీనం చేసుకోవడానికి ఆర్టీసీ సంబంధిత అధికారులు సహకరించడంతో ఆర్టీసీ స్థల బోర్డులను ధ్వంసం చేసినట్టు పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల, ఆర్టీసీ సంబంధిత స్థలాన్ని కబ్జా చేసుకోవడానికి కబ్జా కోర్లు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీనికి తోడు ఆర్టీసీ అధికారులు వారికి సహకరిస్తూ స్థలాన్ని వారికి అప్పజెప్పడానికి పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి ఆర్టీసీ అధికారులకు చెప్పి ఆర్టీసీ స్థలాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే



స్పందించి ఆ స్థలానికి ప్రహరీ కూడా నిర్మించాలని కోరారు. ఆర్టీసీ స్థలానికి ఆర్టీసీ అధికారులు కానీ, ప్రభుత్వం గానీ వారం రోజులలో ప్రహరీ గోడ నిర్మించి, ఆర్టీసీ స్థలాన్ని కాపాడని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసి పేద ప్రజలకు పంచుతామని ఆర్టీసీ అధికారులకు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులుకాట సుధాకర్, నల్ల తీగల శ్రీను, మంద యాదగిరి, .నరసింగం, ఎల్లయ్య, సాయిలు, ఎన్ .యాకయ్య, సారంగం తదితరులు పాల్గొన్నారు.




# పూర్వ ప్రాథమిక విద్య అంగన్వాడిలోనే నేర్చుకోవాలి

### సిడిపిఓ భాగ్యలక్ష్మి

పరకాల రూరల్ జూలై 16 మేజర్ న్యూస్: జూలై 15వ తారీకు నుండి 20వ తారీకు వరకు జరిగే అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా నడికూడ మండల కేంద్రంలో మంగళవారం అమ్మ మాట అంగన్వాడి బాట ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ భాగ్యలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన అంగన్వాడి పిల్లలను అంగన్వాడీలో చేర్పించి వారి భవితకు పునాది వేయాలని పిల్లలకు శారీరక అభివృద్ధి తోడ్పడతాయని తల్లులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శ్రీదేవి, రాజా రాణి, అంగన్వాడీ టీచర్లు నారగాని అనిత, సంపూర్ణ, కళావతి, వినోద, హేమలత, సుగుణ, భాగ్యలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు, ప్రీస్కూల్ పిల్లల తల్లులు మహిళలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకోవద్దు

### పసర ఎస్ఐ అచ్చు కమలాకర్



గోవిందరావుపేట, జులై 16 (మేజర్ న్యూస్ సూర్య): మత్తు పదార్థాలకు అలవాటై అమూల్యమైన జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకోవద్దని పసర ఎస్సై అచ్చ కమలాకర్ యువతకు సూచించారు. మంగళవారం గంజాయి మాదక ద్రవ్యాలపై యువత కు అవగాహన కార్యక్రమం పసర ఎస్సై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కి బానిసై జీవితాలను నాశనం చేసుకోవొద్దు అని కోరారు. పసర గ్రామంలోని ఎస్సీ కాలనీ లోని యువతకు గంజాయి మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. యువత గంజాయి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దు అని, వాటికి ఆకర్షితులు అయి ఆరోగ్యాలను, జీవితాలు నాశనం చేసుకోవొద్దు అని చెప్పారు. అంతేకాకుండా చదువు పై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. ఎటువంటి చెడు అలవాట్లు లేకుండా తమ తల్లీ తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలియచేసారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తమకు తెలియచేయాలని చెప్పారు.

## విలేకరి తల్లి మృతి

### శ్రద్ధాంజలి ఘటించిన మండల విలేకరులు



ఖానాపురం జూలై 16, మేజర్ సూర్య న్యూస్ : ఖానాపూరం మండలంలోని అశోక్ నగర్ గ్రామానికి చెందిన విలేఖరి కళ్లెపు వెంకట్ నారాయణగౌడ్ తల్లి కమలమ్మ (85) అనారోగ్యంతో మృతిచెందగా మృతదేహాన్ని మండల విలేకరులు పల్లెల్ల సోమేశ్వర్ రావు, కుడికాల సతీష్, చలిగంటి కొమురయ్య, జనగం ప్రవీణ్ కుమార్ , జలగం రమేష్, ఇబ్రహీంతోపాటు తదితరులు మృతదేహాన్ని సందర్శించి మృత దేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

### మతసామరస్యానికి ప్రతీక

## మొహరం పండుగ

బచ్చన్నపేట జూలై 16 మేజర్ న్యూస్ సూర్య: మొహరం పండుగ మత సమరస్యానికి ప్రతిక అని కులమతాలకు అతీతంగా 10 రోజులపాటు హిందూ ముస్లింలు కలిసి ఘనంగా జరుపుకునే పండుగ మొహరం అని వి ఎస్ ఆర్ నగర్ మాజీ సర్పంచ్ కోనేటి స్వామి మొహరం గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డబోయిన అశోక్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొహరం పండుగ మొదటి రోజు నుండి పది రోజులపాటు గ్రామంలోని పీరీలతో ప్రతి ఇంటింటికి వెళ్లి పిరిలతో ఊరేగింపుగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గ్రామస్తులందరూ సాయంత్రం వేళ మసీద్ వద్దకు వచ్చేసి ఒసేయ్ దుల అంటూ ఆల్వా ఆటలాడుతూ చిన్న పెద్ద అందరూ కలిసిమెలిసి ఇట్టి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుంద న్నారు.ఈ కార్యక్రమంలో ముజావర్ ఎండి అన్వర్ కమిటీ సభ్యులు రెడ్డబోయిన సత్తయ్య ముశిని శ్రీనివాస్ కోనేటి రాములు మదర్ రెడ్డబోయిన సహదేవ్ ఆలేటి సిద్ధిరాములు గుట్టల సిద్దులు తమ్ముడి బాబు రెడ్డెం గోవర్ధన్ శ్రీరాముల హరి రెడ్డబోయిన నరసింహులు ఆలేటి భాను తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్లపై ఇంప్రూమెంటు కనిపించకపోతే చర్యలు తప్పవు



స్టేషన్ ఘనపూర్, జుల16,మేజర్ న్యూస్(సూర్య): మహిళలు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ ఘనపూర్నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం స్టేషన్ ఘనపూర్ మండలం శివునిపల్లి గ్రామంలోని కె.ఆర్ గార్డెన్స్ లో సెర్ప్ మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎంపీ.డా. కడియం కావ్య ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జఫర్గఢ్,వేలేరు మండలాలలోని మహిళ సంఘాలు (బీ,సీ) గ్రేడులలో ఉండగా అలా ఎందుకు ఉన్నాయని (ఏ) గ్రేడులో ఎందుకు లేవని ఆయా మండలాల ఏపీఎం లను,వీవోఏ లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఈ పథకం దోహదపడుతుందన్నారు.

సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాలిచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. మహిళాశక్తి పథకంపై అవగాహన కల్పించేందుకు అవసరమైతే ప్రత్యేక శిక్షణ యూనిట్లు నెలకొల్పేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. మత్స్య, పశుసంవర్ధకశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రోత్సహించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని రాష్ట్రంలోనే స్టేషన్ ఘనపూర్

**సెర్ప్ మహిళ శక్తి పథకంపై అవగాహన కల్పించాలి**

**3 నెలలకోసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తా**

**వీవోఏల ఆరోగ్య దృష్ట్యా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తా**

**స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలోని మహిళ సంఘాలు (ఏ) గ్రేడుకు చేరుకునేల కృషి చేయాలన్నారు. అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి యూనిట్లపై లబ్ధిదారులకు ప్రోత్సాహకం అందించాలని సూచించారు. అధికారుల టార్గెట్ లపై ఇంప్రూమెంట్ కనిపించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖిఏఎ ఎస్ హెచ్జి లోన్ ల ద్వారా సబ్సిడీని లింక్ చేస్తే పేదవారికి మరింత మేలు జరుగుతుందని అందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మహిళా సమైక్య భవనాలను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. వీవోఏ ల వేతనాల పెంపు విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.





**ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆ దిశగా అధికారులు కృషి చేయాలని ప్రతి మండలంలో మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఔత్సాహిక మహిళా సంఘాలను మహిళా శక్తి పథకం ద్వారా యూనిట్లు ప్రారంభించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇంటిని చక్కదిద్దే మహిళలకు గ్రామాన్ని చక్క దిద్దే శక్తి ఉంటుందన్నారు. రాష్ట్ర ఆదాయంలో మహిళ సంఘాల భాగస్వామ్యం ఉందన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి టార్గెట్లను చేరుకోవాలన్నారు.వీవోఏల ఆరోగ్య దృష్ట్యా హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేస్తానని ఎంపీ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ మొగులప్ప, జనగామ అడిషనల్ డీఆర్డీఏ శ్రీనివాస్,హనుమకొండ అడిషనల్ డీఆర్డీఏ సుధీర్, ఏసిపి భీమ్ శర్మ, డీపీఎం లు సమ్మక్క, రాజేంద్రప్రసాద్, వరలక్ష్మి,వినిత,ఏపీఎం కడారి కుమార స్వామి,స్వర్ణ విజయం మండల అధ్యక్షురాలు మాచర్ల స్రవంతి,కార్యదర్శి మంజుల,కోశాధికారి కోమల తదితరులు పాల్గొన్నారు.

---

**సమాజంలో ధర్మ పరిరక్షణకు ప్రజల ఐక్యతకు ప్రతీక**

## మొహర్రం, తొలి ఏకాదశి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జిల్లా ప్రజలకు మొహర్రం, తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**



జనగామ జిల్లా ప్రతినిధి, జూలై 16, మేజర్ న్యూస్: సమాజంలో ధర్మ పరిరక్షణకు, ప్రజల ఐక్యతకు ప్రతీకగా మొహర్రం, తొలి ఏకాదశి పండుగలు నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ మొహర్రం, తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్బలా యుద్ధంలో విరోచిత పోరాటం గావించిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ధైర్యం, నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.ఇస్లామిక్ క్యాలెండర్ లో మొదటి నెల మొహర్రం అని అన్నారు. ముస్లింలు, హిందువులు కలిసి నిర్వహించే ఈ పీర్ల ఊరేగింపు సమైక్యతను ప్రతిబింబిస్తుందని వివరించారు. క్రీ.శ.622లో మహ్మద్ ప్రవక్త హిజ్రత్ (మక్కాను వదిలి మదీనాకు వలస) ప్రయాణించిన కాలాన్ని మొహర్రం నెల సూచిస్తుందన్నారు. సమాజంలో ధర్మం, సత్యం, న్యాయం, మానవీయ విలువల పరిరక్షణకు కృషి చేసిన ఇమామ్ త్యాగం, సహనాన్ని స్మరించుకుంటూ ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. తెలుగు పండుగలకు తొలి ఏకాదశి ఆది పండుగ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఏడాది పొడవునా ఉండే 24 ఏకాదశుల్లో అషాడ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పరిగణిస్తారన్నారు. లంఖణం పరమ ఔషధం అనే ఉపవాస దీక్షకు నాంది ఈ తొలి ఏకాదశి అని వివరించారు. పర్వదినాన్ని ప్రజలంతా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

---

### ప్రజల సహకారంతో పరకాలను

# సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తా

**కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలి పెట్టం**

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

పరకాల , జూలై 16, మేజర్ న్యూస్: పరకాల పట్టణం ముంపుకు గురికాకుండా ప్రణాళికాబద్ధంగా అంచల వారిగా నగరాన్ని తలపించేలా సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తానని అందుకు ప్రజల సహకారం అవసరమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని వరద ముంపు ప్రాంతాలైన దామెరచెరువు మత్తడి కాలువ, మాదారం బంధం రోడ్డు కల్వర్టు, ఆంధ్ర బ్యాంక్ వద్దగల డ్రైనేజీ, భూపాలపల్లి రోడ్డు కల్వర్టు, పద్మశాలి వాడ పోచమ్మ గుడి డ్రైనేజ్ పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వరద ముంపు ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణలకు గురైన నాలాలను , డ్రైనేజీ వ్యవస్థను, అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను వెంటనే గుర్తించి పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను చేపట్టాలన్నారు. ప్రజలు





ఎదుర్కొంటున్న అత్యవసర సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. దామెర చెరువు మత్తడి కాలువ నాలాపై ఉన్న ఆక్రమణలను తొలగించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. చెరువు కట్ట పటిష్టతకు చేపట్టాల్సిన పనులను అంచనాలతో సహా రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆంధ్ర బ్యాంకు వద్దగల డ్రైనేజ్ నాలాపై వెలసిన అక్రమ నిర్మాణాల తొలగింపును వెంటనే చర్యలు చేపట్టామని తెలిపారు. పరకాల పట్టణం వరద ముంపు నుంచి కాపాడేందుకు తీసుకోవల్సిన చర్యలతో నివేదిక రూపొందించాలన్నారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలి పెట్టవద్దని, ఎలాంటి ఒత్తిడులకు తలొగ్గకుండా ఆక్రమణలను తొలగించి నాలాను విస్తరించాలన్నారు.తమ స్వలాభం కోసమే గత ప్రభుత్వ పాలకులు ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని పేర్కొన్నారు. మురికి కాల్వల ఆక్రమణలను వెంటనే తొలగించి మురికి నీరు ఆగకుండా యధా విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి పేర్కొన్నారు. అధికారులు తమ బాధ్యతలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ఆయన వెంట అధికారులు ,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా బాల్నె ఈశాన్ జన్మదిన వేడుకలు ...!

### విద్యార్థులకు ఉచితంగా బ్యాగుల పంపిణీ, అన్నదానం



చెన్నారావుపేట జూలై 16 (సూర్య మేజర్ న్యూస్): బాల్నె ఈశాన్ మొదటి జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు బాల్నె వెంకన్న-హైమ దంపతుల కుమారుడు కార్తీక్- శిరీషలు కెనడాలో ఉంటున్నారు. వారి కుమారుడు ఈశాన్ మొదటి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని తాతయ్య- నానమ్మ వెంకన్న- హైమలు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా మొదటి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను, ఉపాధ్యాయులకు, అంగన్వాడీ టీచర్లకు వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. తదనంతరం విద్యార్థులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, కడారి సాయిలు, అమ్మ రాజేష్, మేడి సతీష్, గుండెబోయిన రమేష్, జన్ను నరేష్, మురహరి శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు విజయ కుమారి, శైలజ, హఫీజ, అంగన్వాడి టీచర్లు రాధిక, సంధ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరలపై దాడులు



మహబూబాబాద్ రూరల్, జూలై 16, మేజర్ న్యూస్(సూర్య): మంగళవారం మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల బోడగుట్ట తండా, జమాండ్లపల్లి, చంధ్యా తండా, తట్టుపల్లి, తెల్ల బండ తండా గ్రామాలలోని గుడుంబా స్థావరలపై దాడులు నిర్వహించి (04) కేసులు నమోదు చేసి, (04) ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగింది, (18) లీటర్ల సారాయి సీట్ చేయడం జరిగింది.

## నాయబ్ తాసిల్దార్ పై కేసు నమోదు చేయాలి

పర్వతగిరి (జూలై 16) సూర్య న్యూస్: కామారెడ్డి జిల్లా తాడ్వాయి నాయబ్ తాసిల్దార్ పై కేసు నమోదు చేసి , అతనిపై చర్యలు తీసుకోవాలని పర్వతగిరి తహసిల్దార్ ఆఫీస్ సిబ్బంది పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం మంగళవారం అందించారు. తాడ్వాయి తహసిల్దార్ ఆఫీసులో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ప్రశాంత్ ఈనెల 12న నాయబ్ తహసిల్దార్ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారకుడు అయిన నాయబ్ తాసిల్దారుపై కేసు నమోదు చేసి, అతనిపై చర్యలు తీసుకొని ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కక్ష్న, జూనియర్ అసిస్టెంట్లు శంకర్, సుమతి, రమేష్, నజ్మా , చైత్య , వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మురళి నాయక్



కేసముద్రం,జూలై 16, మేజర్ న్యూస్ (సూర్య): కాంగ్రెస్ పార్టీ కేసముద్రం పట్టణ అధ్యక్షులు రావుల మురళి,రావుల రమేష్, పరమేశ్వర్,గంగాధర్ ల తండ్రి రావుల సత్యనారాయణ సంవత్సరీకం మంగళవారం వారి స్వగృహంలో నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ హాజరై సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి,ఘనంగా నివాళుల ర్పించారు.దీంతో పాటు కేసముద్రం పట్టణానికి చెందిన మిత్తింటి రమేష్ అనారోగ్యంతో బాధ పడుతూ గత రెండు రోజుల క్రితం మృతి చెందగా మురళి నాయక్ మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన ఊడుగుల ఉప్పలయ్య, జనగాం రామచారి ఇటీవల మృతిచెందగా ఎమ్మెల్యే మురళి నాయక్ ఆయా కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేయడంతో పాటు ఒక్కొక్క కుటుంబానికి 50 కిలోల బియ్యం అంద జేశారు.ఆయా కార్య క్రమాలలో ఎమ్మెల్యే మురళి నాయక్ వెంట డీసీసీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, బండారు దయాకర్, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షులు కూరెళ్ళి సతీష్, బేరువాడ గ్రామ మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య, సన్నీ గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు,మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్,మండల కోశాధికారి చిదురాల వసంతరావు,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలేపాక నాగరాజు,కోశాధికారి ఓలం రమేష్, మాజీ ఉప సర్పంచ్ బానోత్ వెంకన్న,యూత్ నియోజవర్గ ఉపాధ్యక్షులు అల్లం గణేష్,ఎండీ రఫీ ఖాన్, ఎండీ అయుబ్ ఖాన్,ఎండీ రషీద్ ఖాన్, తరాల సుధాకర్,ఎండీ తాజుద్దీన్, బాదావత్ సుమన్, కొంతం శ్రీను,మూల భూలోక్ రెడ్డీ, మాజీ ఎంపీటీసీ ధరావత్ బాలు నాయక్,పోలేపల్లి వెంకట్ రెడ్డి, నరేటి కొమరయ్య,నరేష్,పిల్లి రమేష్, తోట అఖిల్, అరుణ్, హరిక్రిష్ణ, షేక్ ముజ్జు,కొమురయ్య,యాకన్న,కాలేరు వెంకన్న, ఉప్పలయ్య,రాజేందర్, శ్రావణ్,అనిల్,రవి,సాయి, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వసతి గృహాల పక్కా భవనాలు వెంటనే పూర్తి చేయాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్




భూపాలపల్లి రూరల్ జూలై 16 మేజర్ న్యూస్ సూర్య : భారత విద్యార్థి సమాఖ్య ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రములో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరన్ అధ్యక్షతన నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రములో ఉన్న ఎస్సీ,బీసీ, కలశాల వసతి గృహాలు గత 5 సంవత్సరాల నుండి నిర్మాణం పనులు జరుగుతూనే ఉన్నాయని కానీ ఇప్పటి వరకు వాటిని పూర్తి చేయకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు .అద్దె భవన్లో ఇరుకు గదుల్లో చాలి చాలని రూములో మురికి మరుగుదోడ్ల లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందీ పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాలల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా వసతి గృహాలు ఉన్నాయని అన్నారు .నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యాశాఖ అధికారులు ఒక్క వసతి గృహాల్లో కూడా సందర్శించిన దాఖలాలు లేవని వారు వాపోయారు. విద్యార్థుల మెస్ కి సంబంధించి మెనూ ప్రిపేర్ చేయలేక పోవటం వల్ల విద్యార్థులకు కనీసం నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు . వెంటనే విద్యార్థుల వసతి గృహం సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేసారు .లేని యెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యములో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమములో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ ,జిల్లా కమిటీ సభ్యులు నరేష్ ,స్వామి, ఈశ్వర్, ఆశ్విత్, శివ, అఖిల్ తదితరులు పాల్గోన్నారు

## గీత కార్మికులకు రక్షణ కవచాల పంపిణీ హర్షణీయం

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంద యాకయ్య గౌడ్, జోరు వీరయ్య గౌడ్



చెన్నారావుపేట జూలై 16 (సూర్య మేజర్ న్యూస్): గీత కార్మికుల కోసం రక్షణ కవచాలను ఉచితంగా పంపిణీ చేయడం హర్షణీయమని నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు జోరు వీరయ్య గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గీత కార్మీకులు ప్రమాదాలకు గురై చనిపోయిన సంఘ టనలు చాలా వరకు రాష్ట్రంలో ఉన్నాయని అన్నారు.కాని గత ప్రభుత్వం గీత కార్మి కులను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులను కాపాడుకోవాలని దృఢ నిశ్చయముతో రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య సేఫ్టీ మోకులు అందించడం పట్ల మండలంలోని గీత కార్మికుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఈ సందర్భంగా వారు అన్నారు.గతంలో పెండింగులో ఉన్న ఎక్స్ గ్రేషియా సుమారు రూ. 7 కోట్ల 90 లక్షలను మంజూరు చేయడం సంతోష కరంగా ఉందని వారు అన్నారు.రాష్ట్రంలో కుల వృత్తులను బలోపేతం చేయడం వలన ఉపాధి అవకాశాలు వస్తాయని తాటి ఈత వనాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు.గీత కార్మికులకు అండగా ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డిలకు గీత కార్మికుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు.

## విద్యార్థుల పక్షాన నిలిచి పోరాడేపి డిఎస్‌యు

నెల్లికుదురు జూలై 16 మేజర్ న్యూస్(సూర్య): విద్యార్థుల పక్షాన నిలిచివారి సమస్యలపై పోరాడేది పిడిఎస్యు మాత్రమేనని మండల అధ్యక్షులు గుగులోతు అనిల్ అన్నారు.మంగళవారం మండలకేంద్రంలో తొర్రూరు డివిజన్కార్యదర్శి గొడిశాలమనోజ్ ఆధ్వర్యంలో నూతనమండల కమిటీ ఎన్నికలను నిర్వహిం చారు.మండల అధ్యక్షులుగా గుగులోతు అనిల్ కార్యదర్శిగాబానోతు నందీ శ్వర్, ఉపాధ్యక్షులు నేతావత్,రామ్ చరణ్,కోశాధికారిగా బానోతు సాయికు మార్ ,సహాయ కార్యదర్శిగా బానోతు సాగర్,కమిటీ సభ్యులుగా సిద్ధు,బిక్షం, మహేష్,మనోజ్, వెంకట్రాం,బన్నీ లను నియమించారు.అనంతరంనూతన మండల అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూప్రతి ఒక్కరూ పరస్పర సహకారం అందించుకుంటూవిద్యార్థుల పక్షాన నిలిచి పోరాటం చేయాలని అన్నారు. మండలపరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకుమధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేయాలనికోరారు.పాఠశాలలు ప్రారంభమై రెండు మాసాలు గడిచినపుస్తకాలు,యూనిఫామ్ లు పూర్తిగా అందనిపరిస్థితి ఉందని



అన్నారు.వీటన్నిటిని తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలోరాజు, నరేష్, కుమార్ ,సందీప్, మమత, శ్రావ్య,భవ్య,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## పెసా గ్రామసభల తీర్మాణాలు లేకుండా అటవీ శాఖకు ఇచ్చిన

# ప్రభుత్వ భూములను తక్షణమే వెనక్కు తీసుకోవాలి

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన.ఏ ఎన్ ఎస్ వ్యవస్థపాక రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి**

**పోడు రైతుల పైన అటవీ శాఖా అధికారులు చేస్తున్న అరాచకాలు అరికట్టాలి**

**పెసా చట్టం ప్రకారం ఇసుక క్వారీల్లో ఆదివాసీలకె పని కల్పించాలి**

వెంకటాపురం నూగూరు జులై 16 సూర్య మేజర్ న్యూస్ : షెడ్యూల్ భూములను బదిలీ చేయాలి అంటే పెసా గ్రామసభ నిర్వహించి,1/3 మెజారిటీ తో గిరిజనుల ఆమోదం పొందిన తర్వాతే భూ బదలా యింపు జరగాలని ఏ ఎన్ ఎస్ వ్యవస్థపాక రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి.అన్నారు. శతాబ్దాలుగా పోడునే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు తరతరాలుగా పాలకుల కారణంగా అన్యాయం జరుగుతూనే ఉన్నదని ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థపాక రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి పేర్కొన్నారు. ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో మంగళవారం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, సాగులో ఉన్న వారి పైన అటవీ శాఖా అధికారుల అరాచకాలు అరికట్టాలని వెంకటాపురం మండల కేంద్రం లో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ముందుగా కొమరం భీమ్ విగ్రహానికి దండలు వేసి ప్రధాన రహదారి నుండి మూడు వందల మంది ర్యాలీగా వచ్చి తహసీల్దార్



కార్యాలయానికి చేరుకున్నారు. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ కు పోడు సమస్యల మీద వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. అనంతరం నర్సింహా మూర్తి మాట్లాడుతూ రామచంద్ర పురం గ్రామానికి ఆనుకొని ఉన్న యాభై ఎకరాల గ్రామ కంఠ భూమిని రెవిన్యూ అధికారులు ఎటువంటి నిబంధనలు పాటించ కుండా అటవీ శాఖకు బదిలీ చేశారని ఆయన ఆరోపించారు. అడ్డగోలుగా వేలాది ఎకరాల షెడ్యూల్ భూములను అటవీ శాఖకు బదిలీ చేసిన రెవిన్యూ శాఖా అధికారుల పైన కేసులు పెట్టాలని అన్నారు. రెవిన్యూ శాఖా షెడ్యూల్ ప్రాంతం లో షెడ్యూల్ భూములకు కేవలం కాపలా దారు మాత్రమే అని వివరించారు. ఎన్నో ఏళ్లుగా రామచంద్ర పురం ఆదివాసీల స్వాధీనం లో ఉన్న ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు ఎలా బదిలీ చేస్తారని తహసీల్దార్ ని ప్రశ్నించారు. అటవీ శాఖా అధికారులు పోడు రైతుల పైన చేస్తున్న వేధింపులు మానుకోవాలని అన్నారు. హక్కు పత్రాలు ఉండి ట్రాక్టర్ లతో దున్నుతే కేసులు పెడతామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలను అనుసరించాలా కూడా చేతులతో దున్నాలా అని ఎద్దేవ చేశారు. ఆదివాసీలు ఆధునిక వ్యవసాయ విధానాలు అనుసరించొద్దా అని అటవీ శాఖా అధికారుల పైన మండిపడ్డారు.హక్కు పత్రాలు లేని వాళ్ళని సాగులోకి వెళ్లోద్దని అటవీ శాఖా అధికారులు అడ్డు చెప్పడం తగదని, హక్కు పత్రాలు రాని వారు ఇంకా లక్షల్లో ఉన్నారని గుర్తు చేశారు. హక్కు పత్రాలు ఉన్న ఆదివాసీ రైతులకు వెంకటాపురం లో ఉన్న స్టేట్ బ్యాంకు, గ్రామీణ వికాస్ బ్యాంకు, సహకార సొసైటి బ్యాంకు లు ఎందుకు రుణాలు ఇవ్వడం లేదని నిలదీశారు. వలస గిరిజనేతరులకు అక్రమ పట్టా దారులకు లక్షల్లో వ్యవసాయ రుణాలు ఎలా ఇస్తున్నారని బ్యాంకు అధికారులను నిలదీశారు. ఏజెన్సీ బ్యాంకు లు పని చేసేది గిరిజనులకు ఆర్థిక సహాయ, సహకారాలు అందివ్వడానికె అని అన్నారు. ముకునూరు పాలెం ఆదివాసీల పట్టా భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారని ఎన్ని సార్లు అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేదన్నారు. అసైన్మెంట్ భూములను కాజేసిన ఎల్ టి ఆర్ తో పాటు, పి ఓ టి పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏకన్న గూడెం ఆదివాసీలు ప్రతి యేటా ముంపుకు గురి అవుతూ తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని అన్నారు.పెసా చట్టం ప్రకారం ఇసుక క్వారీల్లో ఆదివాసీలకు మాత్రమే ఉపాధి కల్పిస్తారని అన్నారు. గిరిజనేతరులకు పని కల్పించడం చట్ట వ్యతిరేకం అన్నారు.



కొంతమంది రాజకీయ నాయకులు గిరిజనుల మధ్య విభేదాలు సృష్టించడానికి గిరిజనుల పైకి ఉసుకోలప్తున్నారని మండిపడ్డారు. అమాయక గిరిజనుల పైన కేసులు పెట్టిస్తునట్లు తెలిపారు. గిరిజనుల పైన కేసులు పెడితే ఊరుకునేది లేదన్నారు. పెసా చట్టానికి విరుద్ధంగా ఏజెన్సీ లో అక్రమం గా అటవీ శాఖకు బదిలీ చేసిన వేలాది ఎకరాల భూములను వెనక్కి తీసుకొని ఆదివాసీలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వరద ముంపుకు గురి అవుతున్న ఏకన్న గూడెం ఆదివాసీలకు ఇంటి స్థలాలు కేటాయించాలని అన్నారు . కబ్జా కాబడిన ముకునూరు పాలెం ఆదివాసీల పట్టా భూములను ఆదివాసీలకు ఇవ్వాలని తహసీల్దార్ ని కోరడం జరిగింది. కొండాపురం గ్రామం లో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు గిరిజనేతరులకు ఉచితంగా ఇస్తున్నారని, ప్రజల మధ్యకు వెళ్లి పెసా గ్రామసభ పెట్టి నకిలీ గిరిజనులను గుర్తించి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలనీ అన్నారు. అన్ని సమస్యల పైన సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ వీర భద్ర ప్రసాద్ త్వరలోనే పరిష్కరిస్తా అని హామీ ఇచ్చారు. అటవీ శాఖా అధికారులతో చరవాణిలో మాట్లాడి గిరిజనులను ఇబ్బందులకు గురి చేయొద్దని చెప్పడం జరిగింది. జీవిస్సీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, జిల్లా కార్యానిర్వాహక అధ్యక్షులు పూనెం ప్రతాప్ మద్దతు తెలిపినారు. ఈకార్యక్రమం లో ఏ ఎన్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుంజ మహేష్, జిల్లా కార్యదర్శి మడకం రవి, కేక్కం లక్ష్మణ్ రావు, కుంజ బాలకృష్ణ వివిధ గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు.

---

## రోగులకు మందులు అందుబాటులో ఉంచాలి

**వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి**

**డిఎంహెచ్ వో హరీష్ రాజ్**




స్టేషన్ ఘనపూర్, జులై16,మేజర్ న్యూస్(సూర్య):వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని జనగామ డిఎంహెచ్ వో హరీష్ రాజ్ అన్నారు.మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్బంగా వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.అదేవిధంగా వైద్యులు అందిస్తున్న సేవల గురించి ఓపి,ఇన్ పేషేంట్లను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడి ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్నిరకాల సౌకర్యాలు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గురించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.ముందు జాగ్రత్తగా రోగులకు ఆసుపత్రిలో నిలువ ఉంచిన మందుల గురించి ఎంక్వయిరీ చేశారు.వారికి అవసరమైన మందులను ముందుగానే సమకూర్చుకోవాలని ఆసుపత్రి సూపరిండెంట్ కు సూచించారు.రోగుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ వీరాంజనేయులు,డా.జనార్ధన్,సీహెచ్ వో సాంబయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## సంపత్ రెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్

చెన్నారావుపేట జూలై 16 (సూర్య మేజర్ న్యూస్): మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కర్నూరి సంపత్ రెడ్డిని కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి రావడంతో విషయాన్ని తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వగృహానికి వెళ్లి సంపత్ రెడ్డిని పరామర్శించారు. అలాగే అతని ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సాదు మధుసూదన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, మండల ఉపాధ్యక్షులు నన్నెబోయిన రమేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, రమేష్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు నాని, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లో రైతులకు రక్షణ కల్పించాలి

**రైతులు స్వేచ్ఛగా పంటను అమ్ముకునే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలి**

**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్**



కాశిబుగ్గ ,జులై 16, మేజర్ న్యూస్, (సూర్య) : మార్కెట్ లో రైతులకు రక్షణ కల్పించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి మెమోరండం ఇచ్చినట్లు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి పంట స్వేచ్ఛగా అమ్ముకోవాలని ప్రభుత్వాలు అంటున్నా,ఇప్పటి వరకు రైతులు స్వేచ్ఛగా అమ్ముకోలేని పరిస్థితి ఉందని అన్నారు. రైతులను రాజులు చేస్తామని చెప్పిన ప్రభుత్వాలు రైతుల ఓట్ల గురుంచి మాత్రమే మాట్లాడి చేతులు దులుపుకుంటున్నాయని మండి పడ్డారు.నేటికీ డెబ్బై శాతం మంది మన దేశంలో వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారని, దేశ ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్న రైతులకు ప్రభుత్వం భద్రత కల్పించే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవలే వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ లో గుమస్తాలు రైతులను నానా బూతులు తిడుతూ సయింపు వెంకటేశ్వర్లరావు,సిరుల రవీందర్ రైతుల పై దాడి చేశారని అన్నారు.పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు మార్కెట్లో రక్షణ లేకుండా పోయిందని ,మార్కెట్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం దీనికి నిదర్శనమని అన్నారు.సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కూరగాయ మార్కెట్లో రైతులు పంటలు అమ్ముకునే సదుపాయాలు కల్పిస్తూ రక్షణ కల్పించాలని లేని పక్షాన రైతులను ఐక్యత చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సిరుల రవీందర్, జెండా అంబయ్య పాల్గొన్నారు.